పంట మార్పు.. దిగుబడి పెంచు..

- పంట మార్పిడి విధానంతో బహుళ ప్రయోజనాలు
- చీడపీడలు, కలుపుమొక్కల నివారణ
- భూసారంతో పాటు అధిక దిగుబడులు

భామిని:

రైతులు సంప్రదాయ పంటల సాగును పక్కన పెట్టి, పంట మార్పిడి విధానాన్ని అనుసరిస్తే అధిక ప్రయోజనాలు పొందవచ్చు. ఆధునిక సాగు యాజమాన్య పద్ధతులు పాటిస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. ఒకే రకం పంట కాకుండా వివిధ రకాల పంటలను క్రమ పద్ధతిలో సాగు చేస్తే అధిక లాభాలు పొందవని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సిద్ధమైన అన్నదాతలు పంట మార్పిడి విధానంపై అవగాహన పెంచుకోవాలి. ఏటా ఒకే రకం పంట వేయడంతో పొలాల్లో చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు సమృద్ధిగా పెరగదు. దిగుబడులు తగ్గుతాయి. రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుంది. వేరు వ్యవస్థ ఒకే లోతులో ఉండడం వల్ల నేలలో ఆలోతు వరకు ఉన్న పోషకాలకు మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి. దీని వల్ల భూసారం ఏటా తగ్గిపోయి నేల నిర్వీర్యం అవుతుంది. పండిన పంట నాణ్యత లోపిస్తుంది. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంటుంది. ఒకే పంట అంతా వేయడంతో మార్కెట్ సమస్యలు కూడా వస్తుంటాయి.

అపరాల సాగు అవసరం..

వరి పంట సాగు చేసే ముందు పచ్చిరొట్ట పైర్లు వేయడం వల్ల భూసారం పెరుగుతుంది. సేంద్రియ ఎరువు భూమిలో పెరుగుతుంది. అపరాల సాగుతో తెగుళ్ల బెడద తగ్గుతుంది. వరి తరువాత గింజ జాతికి చెందిన వేరు శనగ, పెసర, మినుము, మొక్కజొన్న వంటి పంటలు వేసుకోవాలి. ఈ ఆరుతడి పంటలు వేయడం వల్ల వాటి వేర్లలోని రైజోబియం బాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకొంటుంది. అపరాల పంట వేరల్లో బుడిపెల మాదిరిగా ఏర్పడి తరువాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తుంది.



టాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు



ఏరుకట్టి నాగలితో భూమిని చదును చేస్తున్న గిరిజన రైతు

నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు వివరాలు..

మండలం	విస్తీర్ణం (హెక్టార్లు)	రైతులు
భామిని	3,668	07,208
సీతంపేట	3,072	09,150
వీరఘట్టాం	7,105	14,151
పాలకొండ	6,345	12,801
మొత్తం	20,190	43,310

మంచి దిగుబడులు సాధ్యం



ఒకే రకం పంటసాగు చేయడం మంచిది కాదు. పంట మార్పిడి విధానం పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం చాలా మంది రైతులు తమ పొలాల్లో ఒకే రకం పంటను తరుచూ వేస్తున్నారు. నీటి పారుదల ఉన్నచోట వరి తప్ప ఇతర పంటలు వేయడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీన్ని అధిగమించేందుకు పంట మార్పిడి విధానం ఉత్తమం.

– కిమిడి మన్మథరావు, మండల వ్యవసాయాధికారి, భామిని

మలుపు ప్రమాదాలకు పిలుపు

సీతంపేట: ఏజెన్సీలో పలు రహదారి మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఆయా మార్గాల్లో ప్రయాణించే వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల మండలంలోని ఘాట్ రోడ్డులో మూడు ఆటోలు బోల్తా పడి ముగ్గురు మరణించారు. 40 మందికి పైగా గాయపడ్డారు. సీతంపేట దోనుబాయి రహదారి మధ్యలో ఎస్.గాటి మలుపు అతి పెద్ద మలుపుగా చెప్పుకోవచ్చు. అలాగే పొల్ల–దోనుబాయి మార్గంలో చాలా మలుపులు ఉన్నాయి. పాలకొండ–సీతంపేట కుశిమి, వాబ, అడ్డాకులగూడ వద్ద ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయి. జగతపల్లి, వంబరెల్లి, ఆడలికి వెళ్లే మార్గంలో భారీ మలుపులు ఉన్నాయి. అలాగే కిట్టాలపాడు మీదుగా శంబాం వెళ్లే మార్గంలో రెండు, మూడు మలుపులు ఉన్నాయి. శంబాం నుంచి కడగండి, సామరెల్లి వెళ్లే మార్గంలో గాటిగుమ్మడ వద్ద, మానాపురం–టిటుకుపాయి వద్ద ప్రమాదకరమైన మలుపు ఉన్నాయి. మలుపుల వద్ద ముళ్ల పొదలు పెరిగిపోవడంతో పాటు ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. అధికారులు స్పందించి మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



గాటిగుమ్మడ సమీపంలో మలుపు



ఎస్.ఘాటీ మలుపు



జగతపల్లి రోడ్డులో ఉన్న మలుపు



టిటుకుపాయి వద్ద ఉన్న మలుపు

వంతెన వద్ద పొంచి ఉన్న ప్రమాదం


భామిని: మండలంలోని అనంతగిరి దిమ్మిడిజోల మధ్య వంశధార వరద కాలువపై నిర్మించిన వంతెన వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఏబీ రోడ్డుపై నిర్మించిన ఈ వంతెనకు వేసిన అప్రోచ్‌లు విడిపోతుండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. 2015లో వంశధార ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు నిర్మించి ప్రారంభించిన ఈ బ్రిడ్జ్ నాణ్యతపై ఆరోపణలు వచ్చాయి. ఇటీవల ఇదే వంతెనకు అప్రోచ్‌కు మధ్య బీటలు వారడంతో ప్రయాణికులు ఆందోళన చేశారు. దీంతో సంబంధిత అధికారులు నామమాత్రంగా మట్టిని పూడ్చి చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం అవే బీటలు చివరి వరకు విస్తరించడంతో బ్రిడ్జికి అప్రోచ్‌కు మధ్య సంబంధాలు తెగిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వంతెనకు, అప్రోచ్‌కు మధ్య ఏర్పడిన బీటలు

బకాయిలు చెల్లించాలి

పార్వతీపురం టౌన్: ఉపాధి వేతనదారులకు బకాయి వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. అధికారుల తీరును నిరసిస్తూ సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామన్నారు. ఈ మేరకు ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉపాధి వేతనదారులు మూడు నెలలుగా ఎండలో పను లు చేస్తున్నా.. ఐదు వారాల డబ్బులు ఇవ్వలేదన్నా రు. అలాగే రెండు పూటలా పని చేయమని చెప్ప డంతో రోజుకు పది కిలోమీటర్ల వరకు నడవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరానికి 200 రోజుల పని కల్పించాలని కోరారు. అలాగే రోజుకు రూ. 400 వేతనం వచ్చేలా పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. పనుల ప్రదేశం వద్ద మజ్జి గ, మంచినీరు, టెంట్ల సదుపాయం కల్పించాలన్నారు.



అరకును తలపించేలా ఏజెన్సీ అందాలు




కొండలపై నుంచి పచ్చదనం

ఆకట్టుకుంటున్న ఏజెన్సీ అందాలు

రుతుపవనాల రాకతో కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీ కొత్త అందాలను సంతరించుకుంది. పచ్చని కొండలను ముద్దాడుతున్న నీలి మేఘాలు, జలపాతాలు, వర్షంనీటితో జాలువారుతున్న కొండలు, పచ్చదనంతో నిండిన దట్టమైన అడవులు, ఆహ్లాదకరమైన వాతావరణం ప్రకృతి ప్రేమికులను రా రమ్మని పిలుస్తున్నాయి. ప్రకృతి అందాలను చూసి ఆస్వాదించేందుకు అదలి వ్యూ పాయింట్‌కు సందర్శకులు క్యూ కడుతున్నారు.

పాలకొండ



కొండలపై దిగినట్లు ఉన్న మేఘాలు



అదలి వ్యూ పాయింట్ వద్ద..

క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో..



భక్తుల పూజలు అందుకుంటున్న కోటదుర్గమ్మ

వీరఘట్టం: స్థానిక కోటదుర్గమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఘటాలతో తరలివచ్చారు. అమ్మవారికి అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని, ప్రకృతి అనుకూలించాలని, ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటూ రైతులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల తాకిడితో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

30 మందికి దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి కన్వీనర్ సుబ్బారావు

బలిజిపేట : మండల కేంద్రంలోని సత్యసాయి సేవామందిరంలో 30 మంది నిరుపేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. వెంగాపురం గ్రామానికి చెందిన లింగరాజు అనే చిరు వ్యాపారి తన తండ్రి జ్ఞాపకార్థం నిరుపేదలకు దుప్పట్ల పంపిణీకి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా యూనిఫారాలు



మండలానికి చేరుకున్న దుస్తులు

సీతానగరం : విద్యార్థులకు పంపిణీ చేయడానికి యూనిఫారాలు సిద్ధంగా ఉన్నాయని ఎంఈఓ–2 ఎం.వెంకటరమణ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, మండల పరిధిలోని విద్యార్థులకు అవసరమైన దుస్తులు మండల విద్యావనరుల కేంద్రానికి చేరుకున్నాయన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు దుస్తులు అందజేస్తామని తెలిపారు.

నర్సిపురంలో ఎమ్మెల్యే పర్యటన

పార్వతీపురం టౌన్: మండలంలోని నర్సిపురంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. కాలువలు అపరిశుభ్రంగా ఉండడం, రహదారి సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి చర్యలు



కె.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్

పార్వతీపురం టౌన్: పట్టణ పరిధిలో 5526 మందికి పింఛన్లు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. లబ్ధిదారులకు అందజేసేందుకు రూ.3.77 కోట్లు ప్రభు త్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. సోమ వారం ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేస్తారని, లబ్ధిదారులు ఇళ్ల వద్దే అందుబాటులో ఉండాలని సూచించారు.

గోతులు పూడ్చిన అధికారులు

సీతానగరం : మండల కేంద్రంలోని మార్కెట్ వద్ద గోతులతో ఉన్న బీటీ రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేశారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శనివారం సాయంత్రం మార్కెట్‌లో పర్యటించి, గోతు లు పరిశీలించి వెంటనే పూడ్చి వేయాలని అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అధికారులు గోతుల్లో మెటల్ వేసి ఆదివారం పూడ్చివేశారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బంద్‌కు సహకరించండి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాజు

పార్వతీపురం టౌన్ : నీట్, యూజీసీ నెట్ పరీక్ష పేపర్ లీక్‌ను నిరసిస్తూ జులై 4న దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాజు అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో బంద్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేపర్ల లీకేజీని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా కెజీ నుంచి పీజీ వరకు విద్యా సంస్థల బంద్‌కు ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత కేంద్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న గంగునాయుడు

జియ్యమ్మవలస: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, ఒక్కపూటే పని చేయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు ఆదివారం కోరారు. ఇదే విషయమై మండల కార్యాలయాల వద్ద సోమవారం ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. 200 రోజుల పనిదినాలు కల్పించాలని, రోజువారీ కూలీ రూ.400 తగ్గకుండా వచ్చేలా చర్యలు తీసుకోవాలని, వేతనదారులకు చెల్లించాల్సిన బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలన్న డిమాండ్లను ప్రభుత్వాల వద్ద ఉంచనున్నామన్నారు. అనంతరం ధర్నాకు సంబంధించి రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులనే డిప్యూటీ వార్డెన్‌లుగా నియమించాలి

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలురు, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో అర్హులైన వారినే డిప్యూటీ వార్డెన్లు, మేట్రిన్‌లుగా నియమించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ ఓ ప్రకటనలో ఆదివారం డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఆశ్రమ పాఠశాలల్లో ఎస్‌జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్)లు లేదా పీఈటీ(ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్)లకు డిప్యూటీ వార్డెన్‌లు, మేట్రిన్‌లుగా నియమించాల్సి ఉన్నప్పటికీ సబ్జెక్ట్ టీచర్‌లను ఆయా స్థానాల్లో నియమిస్తున్నారని దీంతో విద్యార్థులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి, అర్హులుగా గురించిన వారినే ఆయా స్థానాల్లో భర్తీ చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



విద్యాబోధన చేసిన వలంటీర్లు, టీచర్లతో పూర్వ విద్యార్థులు

భామిని: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు.

ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను నెమరువేసుకుని రోజంతా సందడి చేశారు. తాము చదువుకునే సమయంలో పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేకపోయినా ఆరుగురు విద్యా వలంటీర్లు తమకు పాఠాలు బోధించారని, వారి కృషి ఫలితంగా పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత సాధించగలిగామని గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో పాటు విద్యా వలంటీర్లను సన్మానించారు.

పింఛన్ల పంపిణీ సమర్థవంతంగా చేపట్టాలి

పాలకొండ రూరల్: మండలంలో అన్ని పంచాయతీల్లో సోమవారం ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీని సమర్థవంతంగా చేపట్టాలని, లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం సూచనల మేరకు ఎన్‌టీఆర్ పింఛన్ భరోసాకు సంబంధించిన విధివిధానాలపై సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు ఆదివారం అవగాహన కల్పించారు. పింఛన్ల పంపిణీకి సంబంధించిన యాప్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. గతంలో మాదిరి వలంటీర్ల ద్వారా కాకుండా అధికారిక యంత్రాంగం ద్వారా పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.



పింఛన్ల పంపిణీకి సంబంధించిన యాప్‌పై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

సీఎంను కలిసిన భూదేవి

సీతంపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పడాల భూదేవి ఆదివారం విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్టు భూదేవి తెలిపారు. సమస్యల పరిష్కారంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఆమె ఓ ప్రకటనలో తెలిపారు.



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న భూదేవి

విస్తారంగా పత్తిసాగు

భామిని: మండలంలో ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండలంలో అధిక విస్తీర్ణంలో పత్తి సాగు జరుగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలు పత్తి విత్తనాలు నాటుకునేందుకు అనుకూలంగా ఉండటంతో రైతులు పొలం పనుల్లో తలమునకలైయ్యారు. మెట్టు పొలాలను దుక్కి దున్ని చదును చేస్తున్నారు. తాడు సాయంతో కొలతలు వేసి క్రమ పద్ధతిలో ప్రత్తి విత్తనాలు నాటుతూ కనిపించారు. మరోవైపు వరిసాగు రైతులు పొలాలను చదునుచేసి వెదజల్లు పద్ధతిలో విత్తనాలు వేసుకుంటున్నారు.



బిల్లుమడలో పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు

సేవలే గుర్తింపునిస్తాయి

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ రూరల్: ప్రభుత్వ ఉద్యోగి తన విధి నిర్వహణ కాలంలో ప్రజలకు అందించిన సేవలే ఆయనకు గుర్తింపునిస్తాయని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పరిపాలనాధికారిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన డొంక త్రినాథులు, ఆయన సతీమణి జయలక్ష్మి సన్మాన కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ విక్రాంత్ త్రినాథులు, జయలక్ష్మి దంపతులను సన్మానించారు. ఏవో గానే కాకుండా పాలకొండ, వంగర మండలాల్లో ఎంపీడీఓగా త్రినాథులు అదనపు బాధ్యతలు నిర్వహించి ప్రజలకు సేవలందించారని సహసర సిబ్బంది గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు లోలుగు విశ్వేశ్వరరావు, తిర్లంగి ఉపేంద్రకుమార్, పాలవలస ధవళేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ సంఘం అధ్యక్షుడు కిల్లారి నారాయణరావు, మండల పరిషత్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



త్రినాథులు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, ప్రజా ప్రతినిధులు, అధికారులు